క్లుప్తంగా

నామినేషన్ దాఖలు



నామినేషన్ పత్రాలు అందజేస్తున్న కార్పొరేటర్ బొంతు శ్రీదేవి

కుషాయిగూడ: జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్‌గా చర్లపల్లి డివిజన్ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి సోమవారం నామినేషన్ దాఖలు చేశారు. అధిష్టానం ఆదేశాలతో జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ ఎలక్షన్ రిటర్నింగ్ ఆఫీసర్ సత్యనారాయణకు నామినేషన్ పత్రాలు అందజేశారు.

సమస్యలు పరిష్కరించాలి

గౌతంనగర్: మల్కాజిగిరి డివిజన్ పరిధిలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కార్పొరేటర్ శ్రావణ్ జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయం, జోనల్ కమిషనర్ కార్యాలయాల్లో సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాజ్‌పేయ్‌నగర్‌లోని వాజ్‌పేయ్ విగ్రహం వద్ద సుందరీకరణ పనులు చేపట్టాలని, టౌన్‌ప్లానింగ్‌లో బిల్డింగ్ పర్మిషన్లు ఇచ్చేందుకు అధికారులు ఇబ్బంది పెడుతున్నారని, పాత ఇళ్లు కూలగొడితే ఇంటి పర్మిషన్లు ఎందుకు ఇవ్వరని, అనుమతి తర్వాతే కూలగొడుతామని అండర్ టేకింగ్ తీసుకుని ఇవ్వాలని కోరారు. అలాగే సఫిల్‌గూడ పాండ్ పనులకు నిధులు మంజూరు చేయాలని, ఓల్డ్ మల్కాజిగిరిలో బస్తీ దవాఖాన కట్టాలని వినతిపత్రంలో కోరారు.

వెస్ట్ బాలాజీహిల్స్ కాలనీలో విగ్రహ ప్రతిష్ఠ

బోడుప్పల్: వెస్ట్ బాలాజీహిల్స్ కాలనీలోని శ్రీ అమరలింగేశ్వర స్వామి, అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని సోమవారం వైభవంగా నిర్వహించారు. అలాగే పలు పూజలు చేశారు. ముఖ్య అతిథిగా మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ బీ బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిశోర్‌గౌడ్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు దేవేంద్ర మిత్తల్, ప్రధాన కార్యదర్శి బట్టు దేవేందర్, కాలనీ అధ్యక్షుడు చింతల శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బట్టు చంద్రశేఖర్, కాలనీవాసులు పాల్గొన్నారు.

ఇంటి పన్ను తగ్గించాలని వినతి

రామంతాపూర్ : భగాయత్ కేసీఆర్‌నగర్‌లోని వెంకట్‌సాయినగర్, బాలకృష్ణనగర్, సాయి కృష్ణ కాలనీ, అన్నపూర్ణ కాలనీలో గల గృహాల ఇంటి పన్ను తగ్గించాలని సంక్షేమ సంఘం అధ్యక్షుడు అల్లాడి నిరంజన్, తిక్కారెడ్డి కోరారు. ఈమేరకు సోమవారం ప్రజావాణిలో ఉప్పల్ సర్కిల్ డీసీ ఆంజనేయులుకు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ.. తాము సంవత్సరం ఇంటి పన్ను చెల్లించడానికి సిద్ధంగా ఉన్నామని, కానీ అధికారులు మూడేళ్ల ఇంటి పన్ను చెల్లించాలంటూ ఒత్తిడి తెస్తున్నారన్నారు. ఈ విషయమై చర్చించి నిర్ణయం తీసుకుంటామని డీసీ వారికి హామీనిచ్చారు.

పాతాళానికి పానీ..!

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో అడుగంటుతున్న భూగర్భ జలాలు

- గత జనవరిలో సగటున 1.83 మీటర్ల లోతుకు పడిపోయిన వైనం
- అత్యధికంగా ఉప్పల్‌లో 5.35 మీటర్ల డౌన్
- నీటి పొదుపుపై ప్రజల్లో అవగాహనపై చర్యలు
- గతేడాది జనవరితో పోల్చితే 13 మండలాల్లో తగ్గుముఖం
- ఘట్‌కేసర్, ఎంసీపల్లిలో నిలకడగా జలమట్టం



నీటి మట్టాన్ని లెక్కిస్తున్న భూగర్భజల వనరుల శాఖ ఉద్యోగులు

సాక్షి, సిటీబ్యూరో: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయి. గతేడాది జనవరితో పోల్చుకుంటే, ఈఏడాది జనవరిలో సగటున 1.83 మీటర్ల లోతుకు పడిపోయింది. జిల్లాలోని 13 మండలాల్లో నీటి మట్టం కూడా గణనీయంగా తగ్గుముఖం పట్టింది. ముదురుతున్న ఎండల నేపథ్యంలో జిల్లా భూగర్భ జల శాఖ నీటిని పొదుపుగా వాడుకోవాలని అవగాహనకు కార్యక్రమాలకు సన్నద్ధమవుతోంది. రానున్న 4 నెలల్లో ఎండలు మరింత తీవ్రం కానుండడంతో నీటి పొదుపు చాలా అవసరమని పేర్కొంటోంది. వర్షపు నీరు వృథాగా పోకుండా..ఇంటి ఆవరణలోనే ఇంకించుకునేలా ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని జిల్లా భూగర్భ జల శాఖ సూచిస్తున్నది. రైతులు కూడా పొలాల్లో నీటి కుంటలు ఏర్పాటు చేసుకోవాలని కోరుతోంది. అలాగే ఆరుతడి పంటల మార్పిడికి సిద్ధం కావాలని పేర్కొంటోంది. ఎండిపోయిన బోరుబావులను రీచార్జి చేసుకునేలా అవశ్యకతపై దృష్టి సారించాల్సి అవసరముందంటోంది.

13 మండలాల్లో తగ్గిన జలం..

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో గతేడాది జనవరితో పోల్చుకుంటే జిల్లాలో సగటున 1.83 మీటర్ల లోతుకు జలమట్టం పడిపోయింది. మండలాల వారీగా పరిశీలిస్తే 13 మండలాల్లో లోతుకు పడిపోగా, మిగతా 2 మండలాల్లో నిలకడగా నీటి మట్టం ఉన్నట్లు భూగర్భజల శాఖ రికార్డులు పేర్కొంటున్నాయి. కూకట్‌పపల్లి మండలంలో అత్యధికంగా 18.79 మీటర్ల లోతుకు భూగర్భ జలమట్టం పడిపోయింది. తర్వాత స్థానంలో మల్కాజిగిరి, ఉప్పల్, దుండిగల్, మేడిపల్లి, మేడ్చల్, కుత్బుల్లాపూర్, బాలానగర్, శామీర్‌పేట, కాప్రా, మేడిపల్లి, కీసర, బాచుపల్లి మండలాలు ఉన్నాయి. జిల్లాలోని 13 మండలాల ప్రజలు నీటిని పొదుపుగా వాడుకోవాలని జిల్లా భూగర్భజల శాఖ కోరుతున్నది. మరో 2 మండలాల్లో మాత్రం భూగర్భ జలమట్టం నిలకడగా ఉంది. ఎంసీపల్లిలో మండలంలో గతేడాది (2024)జనవరితో పోల్చితే ఈ ఏడాది (2025) జనవరిలో 0.73 మీటర్ల భూగర్భ జలమట్టం పెరిగింది. అలాగే, ఘట్‌కేసర్ మండలంలో 0.45 మీటర్ల జలమట్టం పెరిగింది. అయినప్పటికీ ముదురుతున్న ఎండలను దృష్టిలో పెట్టుకుని నీటి పొదుపును పాటించాలని భూగర్భజల శాఖ జిల్లా ప్రజలను కోరుతోంది.

మేడ్చల్ జిల్లాలోని 15 మండలాల్లో గతేడాదితో పోల్చుకుంటే భూగర్భ జలాల పరిస్థితి

మండలం	జనవరి 2024	జనవరి 2025	తేడా
అల్వాల్	9.33	9.53	0.20
బాచుపల్లి	4.49	6.85	2.36
బాలానగర్	8.01	8.80	0.80
దుండిగల్	12.75	14.93	2.18
ఘట్కేసర్	7.01	6.57	0.45
కాప్రా	4.17	5.11	0.94
కీసర	7.57	9.45	1.88
కూకట్‌పల్లి	11.95	18.79	6.84
ఎంసీపల్లి	16.34	15.61	0.73
మల్కాజిగిరి	15.69	17.60	1.91
మేడ్చల్	7.94	11.20	3.26
మేడిపల్లి	13.00	13.93	0.94
కుత్బుల్లాపూర్	7.37	10.68	3.31
శామీర్‌పేట్	5.00	6.49	1.49
ఉప్పల్	6.29	11.65	5.35
జిల్లా సగటు	9.38	11.21	1.83

సర్కారు విద్యార్థులకు కంటి పరీక్షలు



విద్యార్థులకు కంటి పరీక్షలు చేస్తున్న దృశ్యం

గౌతంనగర్: బాల సురక్ష' లో భాగంగా మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో మల్కాజిగిరిలోని ఏరియా ఆస్పత్రిలో జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న దృష్టి లోపం విద్యార్థులకు సోమవారం కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో డాక్టర్ ఉమాగౌరి మాట్లాడుతూ.. మార్చి 15వ తేదీ వరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. రోజుకు 150 నుంచి 200 మంది చొప్పున విద్యార్థులకు సిబ్బంది పరీక్షలు చేసిన అనంతరం వారి రిపోర్టులను రాష్ట్రస్థాయికి పంపించి పిల్లలకు అద్దాలు రాగానే అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్రీయ బాల సురక్ష (ఆర్‌బీఎస్‌కే) సిబ్బంది, పారా మెడికల్ ఆప్తామాలజిస్ట్ ఆఫీసర్స్, ప్రొఫెసర్స్, సిబ్బంది పాల్గొన్నారు.

శుభకార్యానికి వచ్చి.. కారు ప్రమాదంలో బాలుడి మృతి

- మరో ముగ్గురు పిల్లలకు తీవ్ర గాయాలు
- అతివేగంగా వచ్చి బోల్తాపడ్డ కారు
- వాహనాన్ని నడిపిన 17 ఏళ్ల మైనర్ బాలుడు
- మృతుడిది హైదరాబాద్‌లోని మల్లాపూర్



జయ రక్షిత్ (ఫైల్)

మిరుదొడ్డి(దుబ్బాక): బంధువుల ఇంట్లో శుభకార్యానికి వచ్చి సరదాగా వాగు పరిసరాలను, వ్యవసాయ పొలాలను తిలకిద్దామని వెళ్లిన బాలుడు కారు బోల్తా పడటంతో మృతి చెందాడు. మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ నలుగురిలోని 17 ఏళ్ల మైనర్ బాలుడు అతివేగంగా కారు నడపడంతోనే ప్రమాదం చోటు చేసుకున్నట్లు తెలిసింది. ఈ విషాదకర ఘటన సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండలం అల్వాలలో సోమవారం చోటు చేసుకుంది. మిరుదొడ్డి పోలీసుల కథనం మేరకు.. హైదరాబాద్‌లోని మల్లాపూర్‌కు చెందిన లేగల నరేందర్, సుజాత దంపతులు వారి పిల్లలు జయ రక్షిత్ (14), జశ్వంత్‌తో కలిసి అల్వాలలోని తమ బంధువులైన బొమ్మ జ్యోతి గృహ ప్రవేశం కార్యక్రమానికి వచ్చారు. అలాగే కరీంనగర్ పట్టణానికి చెందిన ఏదుల రవిశంకర్ స్వప్న దంపతులు వారి పిల్లలు యశ్వంత్, అమ్ములుతో హాజరయ్యారు. సోమవారం సరదాగా అల్వాల శివారులోని కోదండ రాముడి ఆలయం, కూడవెల్లి వాగు పరిసరాలు, వ్యవసాయ పొలాలను తిలకించడానికి జయ రక్షిత్, జశ్వంత్, యశ్వంత్, అమ్ములు కలిసి కారులో బయలు దేరారు. ఇందులోని 17 ఏళ్ల మైనర్ బాలుడు జశ్వంత్ కారు నడుపుతున్నాడు. ఎరుకలి వాడ సమీపంలోకి రాగానే మలుపు వద్ద కారు అతివేగంగా వస్తూ అదుపుతప్పి బోల్తా పడింది. రెండు పల్టీలు కొట్టడంతో కారులోని జయ రక్షిత్ అక్కడికక్కడే మృతి చెందాడు. మరో ముగ్గురు పిల్లలకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడ్డ వారిని స్థానికుల సహాయంతో 108 ద్వారా సిద్దిపేట జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. జశ్వంత్, యశ్వంత్‌ల పరిస్థితి విషమంగా మారడంతో సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుడు మల్లం రవి కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఉప్పల్ డిగ్రీ కాలేజీ ప్రాజెక్టుల ఎంపిక



విద్యార్థులకు అభినందనలు తెలుపుతున్న అధ్యాపకులు

ఉప్పల్: తెలంగాణ కళాశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి జిజ్ఞాస విద్యార్థి అధ్యాయన యోజన పోటీలకు ఉప్పల్ డిగ్రీ కళాశాల నుంచి ఐదు రాష్ట్రస్థాయి ప్రాజెక్టులు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా. కె. విజయ్ కుమార్ తెలిపారు. పోటీల్లో 1047 ప్రాజెక్టులు పోటీపడగా 291 ప్రాజెక్టులు ఎంపికైనట్లు పేర్కొన్నారు. విద్యార్థులకు క్షేత్రస్థాయి పరిశోధనలపై మరింత ఆసక్తి పెరగాలని ఆకాంక్షించారు.

పట్టుదలతో చదివితేనే లక్ష్య సాధన

- మేడ్చల్–మల్కాజిగిరి కలెక్టర్ గౌతమ్ పోట్రు
- కిష్టాపూర్ రెసిడెన్షియల్ పాఠశాల, కాలేజీ తనిఖీ



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్



భోజనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

మేడ్చల్: పట్టుదలతో చదివితేనే అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవచ్చని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ పోట్రు అన్నారు. కిష్టాపూర్ లోని సాంఘిక సంక్షేమ శాఖ రెసిడెన్షియల్ పాఠశాల, జూనియర్ కళాశాలలను సోమవారం సందర్శించారు. సిలబస్, వసతులు, భోజనం ఎలా ఉంటుందని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వంటగదిని, మెనూ చార్ట్‌ను పరిశీలించారు. విద్యార్థులకు సరిపడా టేబుళ్లు, కుర్చీలు ఏర్పాటు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. కళాశాల, పాఠశాలలో మరమ్మతుల కోసం నిధులు మంజూరు చేయాలని కోరగా అంచనాలు అందించాలని సూచించారు. డ్రైనేజీ, ప్రహరీ నిర్మాణాలు, ఫ్యాన్లు, లైట్లు ఏర్పాటు చేయాలని ఉపాధ్యాయులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన వెంట తహసీల్దార్ శైలజ, ప్రిన్సిపాల్ లలిత, జోనల్ ఆఫీసర్ రజిత ఉన్నారు.

శ్రీకృష్ణ ఆలయంలో లక్ష పుష్పార్చన



బోడుప్పల్: పన్నాల రవీందర్‌రెడ్డి కాలనీలోని శ్రీకృష్ణ ఆలయ త్రయోదశ వార్షికోత్సవ బ్రహోత్సవాల్లో భాగంగా సోమవారం స్వామి వారికి లక్ష పుష్పార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. అలాగే పలు పూజలు చేశారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తలు పన్నాల కృష్ణారెడ్డి, ఆలయ చైర్మన్ అంజి పటేల్, భక్తులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణకు చర్యలు

అల్వాల్: అల్వాల్ ప్రధాన రహదారికిరువైపులా రోడ్డు విస్తరణకు అడ్డంకిగా ఉన్న అంశాలను జీహెచ్‌ఎంసీ ట్రాఫిక్, విద్యుత్ శాఖ అధికారులు సంయుక్తంగా సోమవారం పరిశీలించారు. రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాలను, బస్టాప్‌ను వేరే చోటకి మార్చడంతో పాటు ట్రాఫిక్ ఒకే చోట ఉండకుండా తీసుకోవాల్సిన ప్రణాళికలపై చర్చించారు. అల్వాల్ తెలంగాణ తల్లి విగ్రహం నుంచి రాజీవ్‌గాంధీ విగ్రహం వరకు చేపట్టాల్సిన పలు అంశాలను పరిశీలించారు. జీహెచ్‌ఎంసీ అల్వాల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, ట్రాఫిక్ ఏసీపీ వెంకట్‌రెడ్డి, విద్యుత్ ఏఈ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

ఉప్పల్: ఐఎస్ఐ హబ్సిగూడ 11 కేవీ ఫీడర్ మరమ్మతుల కారణంగా వీధినంబర్–8లో మంగళవారం ఉదయం 10.30 నుంచి 11 గంటల వరకు రవీంద్రానగర్ లేన్ నంబర్–5 నుంచి 27 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ గణేశ్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.

నాచారం ఐఐసిటి ఫీడర్ పరిధిలో..

నాచారం ఐఐసిటి ఫీడర్ మరమ్మతుల కారణంగా 33/11 కేవీ ఫీడర్ పరిధిలో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు భవానీనగర్, వీఎస్‌టీకాలనీ, రాజీవ్‌నగర్, శ్రీనగర్ కాలనీ, నాచారం మెయిన్ రోడ్డు, హనుమాన్ టెంపుల్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదు.

స్నేహపురి 33/11 కేవీ ఫీడర్‌లో..

స్నేహపురి 33/11 కేవీ ఫీడర్ మరమ్మతుల కారణంగా మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు స్నేహపురి కాలనీ, భవానీనగర్, వీధినంబర్ 3 నుంచి 5 వరకు, వీఎస్‌టీ కాలనీ, పీఅండ్‌టీ కాలనీ తదితర ప్రాంతాలు.

హెచ్‌ఎంటీ నగర్ ఫీడర్‌లో..

హెచ్ఎంటీ నగర్ ఫీడర్ పరిధిలోని ఎన్‌జీఆర్‌లో మధ్యాహ్నం 3 నుంచి 3.30 వరకు, హెచ్‌ఎంటీనగర్ వీధి నంబర్ 1 నుంచి 12 వరకు బాపూజీనగర్, మెయిన్ రోడ్డు, తదితర ప్రాంతాలు.

హెచ్‌ఎంటీనగర్ ఫీడర్‌లో..

హెచ్ఎంటీనగర్ ఫీడర్ పరిధిలో మంగళవారం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు హెచ్‌ఎంటీనగర్ వీధినంబర్ 2 నుంచి 12 వరకు, బాపూజీనగర్, సరస్వతీకాలనీ, సాయిదుర్గా కాంప్లెక్స్, హైకోర్టు కాలనీ, తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ నిఖిల్ నర్సింగరావు తెలిపారు.

11 కేవీ పెద్ద చెరువు ఫీడర్‌లో..

11 కేవీ పెద్ద చెరువు ఫీడర్ మరమ్మతుల కారణంగా ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు హెచ్ఎం డబ్ల్యూ ఎస్ఎస్‌బీ తదితర ప్రాంతాలు.

కల్యాణపురి ఫీడర్‌లో..

కల్యాణపురి ఫీడర్ మరమ్మతుల కారణంగా మధ్యాహ్నం 1 నుంచి 2 గంటల వరకు జాహీద్‌నగర్, బ్యాంక్ కాలనీ, ఇందిరానగర్, అంబేద్కర్ నగర్, సీతారామ కాలనీ, ఈస్ట్, నార్త్ కల్యాణపురి టీచర్స్ కాలనీ, అజ్మత్ నగర్, విసాసత్‌నగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

విద్యుత్ సబ్‌స్టేషన్ పనులు నిలిపేయాలి

బోడుప్పల్: వాసవీనగర్ కాలనీ వీధి నంబర్–6 లో జనవాసాలను ఆనుకుని నిర్మిస్తున్న విద్యుత్ సబ్‌స్టేషన్ పనులు ఆపాలంటూ ఆ కాలనీవాసులు కలెక్టరేట్‌లోని ప్రజావాణిలో సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వాసవీనగర్ కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు మోహన్‌బాబు, ప్రధాన కార్యదర్శి క్రాంతి కుమార్ మాట్లాడుతూ.. సబ్‌స్టేషన్ నిర్మాణం కాలనీకి ఆనుకుని ఉండడం వల్ల రేడియేషన్ లాంటి సమస్యలు తలెత్తనున్నాయన్నారు. అంతేగాకుండా సదరు స్థలాన్ని గతంలో కాలనీ ప్రజల సౌకర్యార్థం పార్కుకు కేటాయించి ఓపెన్ జిమ్ ఏర్పాటుకు ప్రతిపాదనలు చేశారన్నారు.

మల్లన్న గుడి ముఖద్వారానికి భూమిపూజ



భూమి పూజ చేస్తున్న దృశ్యం

గౌతంనగర్: మల్లికార్జునగర్‌లోని మల్లన్న గుడి ముఖ ద్వారానికి మండలి రాధాకృష్ణయాదవ్ ఆలయ కమిటీ సభ్యులు సోమవారం భూమి పూజ చేశారు. రూ.10 లక్షల సొంత నిధులతో నిర్మాణం చేపట్టామని దాత మండలి రాధాకృష్ణయాదవ్ తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు వెంకటేశ్ యాదవ్, మల్లన్న గుడి పాలకమండలి సభ్యులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం



మేడిపల్లి: గుర్తుతెలియని మృతదేహం లభ్యమైన ఘటన మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి హేమానగర్ కాలనీ రోడ్డునంబర్–8లో సోమవారం గుర్తు తెలియని వ్యక్తి అపస్మారకస్థితిలో ఉన్నట్లు గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని చికిత్స కోసం గాంధీ ఆసుపత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి వయసు సుమారు 45 ఏళ్లు ఉంటాయని మృతుడి వివరాలు తెలిసిన వారు ఉంటే మేడిపల్లి పోలీసులను సంప్రదించాలని వారు సూచించారు.

ఘనంగా కేసీఆర్ జన్మదిన వేడుకలు



అల్వాల్‌లో వేడుకల్లో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, కార్పొరేటర్లు



చిలుకానగర్ చౌరస్తాలో పండ్లు పంపిణీ చేస్తున్న రాగిడి లక్ష్మా రెడ్డి

ఉప్పల్: ఉప్పల్, చిలుకానగర్, హబ్సిగూడ తదితర ప్రాంతాల్లో సోమవారం మాజీ సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలను ఆ పార్టీ శ్రేణులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి పండ్లు పంపిణీ చేశారు. చిలుకానగర్‌లో కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి రాగిడి లక్ష్మారెడ్డి, చిలుకానగర్ కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్ హాజరై కేక్ కట్ చేశారు. ఉప్పల్ డివిజన్‌లో పిల్లి నాగరాజు ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. చిలుకానగర్ చౌరస్తాలో జెల్లి మోహన్, పిట్టల నరేశ్ ఈరెల్లి రవీందర్ రెడ్డి, గుడి మధుసూదన్ రెడ్డి, మాస శేఖర్‌ల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి రాగిడి లక్ష్మారెడ్డి హాజరై పండ్లు పంపిణీ చేశారు.

మల్లాపూర్ వార్డు కార్యాలయం వద్ద ..

మల్లాపూర్: మల్లాపూర్ వార్డు కార్యాలయం వద్ద మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో మాజీ సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉప్పల్ ఎమ్మెల్యే రాగిడి లక్ష్మారెడ్డి హాజరై కేక్ కట్ చేశారు. అనంతరం అంబేడ్కర్ భవన్‌లో మొక్క నాటారు. అలాగే సూర్యనగర్ ప్రభుత్వాస్పత్రిలో రోగులకు కార్పొరేటర్ దేవేందర్‌రెడ్డి పండ్లు పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో తండా వాసుగౌడ్, ధర్మారెడ్డి, హమాలీ శ్రీను, చిన్న దుర్గయ్య, రాపోలు సతీశ్, తీగుళ్ల శ్రీనివాస్‌గౌడ్, దయాకర్‌రెడ్డి, పీఆర్. ప్రవీణ్, కోటేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



కేసీఆర్‌తో ఉప్పల్ శ్రీశ్రీనగర్ డివిజన్ బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మీసాల అంజయ్య

నాచారంలో..

నాచారంలో అను ఫర్నీచర్ వద్ద నాచారం డివిజన్ బీఆర్ఎస్ మాజీ డివిజన్ అధ్యక్షుడు మేకల ముత్యం రెడ్డి ఆధ్వర్యంలో నాచారం కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్ హాజరై కేక్ కట్ చేశారు. భూపాల్‌రెడ్డి, విఠల్ యాదవ్, రామకృష్ణ, రాంచందర్, రాజబాబు, కట్ట బుచ్చన్న, గణేశ్, భాను, అశోక్ పాల్గొన్నారు.

చర్లపల్లి, మీర్‌పేట–హెచ్‌బీకాలనీ డివిజన్ల పరిధిలో..

కుషాయిగూడ: చర్లపల్లి డివిజన్, మీర్‌పేట–హెచ్‌బీ కాలనీ డివిజన్ల పరిధిలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు.

పీర్జాదిగూడలో..

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మేడిపల్లి బీఆర్ఎస్ కార్యాలయం వద్ద మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే మొక్కలు నాటడం, రక్తదాన శిబిరం ఏర్పాటు, విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు, మహేశ్, తేతాకుల మాధవి, మధుసూధన్ రెడ్డి, దొంతిరి హరిశంకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎడవెల్లి రఘువర్ధన్ రెడ్డి, మనోరంజన్ రెడ్డి, జావీద్‌ఖాన్, ప్రభాకర్ రెడ్డి,అంజనేయులు, బాలరాజ్, కోనేటి వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

మల్కాజిగిరి నియోజకవర్గంలో..

అల్వాల్/గౌతంనగర్: మల్కాజిగిరి నియోజకవర్గంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పలు చోట్ల మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, స్థానిక కార్పొరేటర్, నాయకులతో కలిసి కేక్ కట్ చేశారు అదేవిధంగా పలుచోట్ల పండ్లు, అల్పాహారం పంపిణీ చేశారు.



నాచారంలో కార్పొరేటర్ శాంతి సాయిజెన్..



మీర్‌పేట–హెచ్‌బీకాలనీలో ..